

వీవోఏల సమస్యలు పరిష్కరించాలి
తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వీవోఏలు మంగళవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు.
- 8లో ▸



'సాక్షి' మాక్ ఎంసెట్‌కు స్పందన
'సాక్షి' దినపత్రిక ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన మాక్ ఎంసెట్‌కు విశేష స్పందన లభించింది.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
32.3 /20.3
వాతావరణం
ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. సాయంత్రం అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం తగదు

● అధికారుల తీరుపై స్పీకర్ అసంతృప్తి



రుద్రూర్: అకాల వర్షాలతో రైతులు ఆందోళనలో ఉంటే క్షేత్ర స్థాయిలో పర్యటించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. కోటగిరి ఉమ్మడి మండలంలో అకాల వర్షానికి దెబ్బతిన్న పంటలు, తడిసిన ధాన్యాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం మార్కెట్ కమిటీలో జిల్లాస్థాయి అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు నిర్వహించారు. లింగాపూర్ నుంచి కోటగిరి వరకు కొనుగోలు కేంద్రాల వద్ద రెవెన్యూ, వ్యవసాయ సిబ్బంది ఒక్కరు కూడా లేరని ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వేచేసి నివేదిక ప్రభుత్వానికి పంపించాలని అధికారులకు సూ చించారు. స్థానిక ప్రజా ప్రతినిధులు రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో, రైస్ మిల్లుల్లో తరుగు తీయకుండా చూడాలన్నారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్, డీఎస్‌వో చంద్రప్రకాశ్, డీసీవో సింహాచలం, జెడ్పీటీసీ శంకర్ పటేల్, ఏఎంసీ చైర్మన్ అబ్దుల్ హమీద్, సొసైటీ విండో చైర్మన్ కూచి సిద్దు, స్థానిక సర్పంచ్ పత్తి లక్ష్మణ్ ఉన్నారు.

పంట నష్టాన్ని ప్రభుత్వానికి నివేదిస్తాం




సిరికొండ: వడగళ్ల వర్షం కారణంగా వరి పంటకు పెద్ద ఎత్తున నష్టం వాటిల్లిందని, రైతులకు పంట నష్ట పరిహారం కోసం ప్రభుత్వానికి నివేదిస్తామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి తిరుమల ప్రసాద్ తెలిపారు. మండలంలోని రావుట్ల, మెట్టు తండా, నారాయణపల్లెలో వడగండ్ల వర్షానికి దెబ్బతిన్న పంటలను, తడిసిన ధాన్యాన్ని డీఏవో మంగళవారం పరిశీలించారు. పంటలు దెబ్బతిన్న రైతులు పెద్ద ఎత్తున నష్టపోయామని డీఏవోతో ఆవేదన వ్యక్తం చేశారు. వడగళ్లతో నష్టం బాగా జరిగిందని, వరి పంటపై ఒక్క గింజ లేకుండా రాలిపోయాయని డీఏవో పేర్కొన్నారు. జరిగిన పంట నష్టంపై రైతుల వారిగా సర్వే చేసి నష్టపరిహారం వచ్చేలా చూస్తానని డీఏవో రైతులకు హామీఇచ్చారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ రాజన్న, సర్పంచ్ భూదేవ్వరాజన్న, ఉపసర్పంచ్ రఘువాస్ తదితరులున్నారు.

బీజేపీలో చేరిన పోచారం సర్పంచ్



ఎడపల్లి(బోధన్): ఎడపల్లి మండలంలోని పోచారం గ్రామ సర్పంచ్ (బీఆర్ఎస్ పార్టీ) మంగళవారం హైదరాబాద్‌లో ఎంపీ అర్వింద్ సమక్షంలో బీజేపీలో చేరారు. తెలంగాణ ప్రభుత్వం సర్పంచ్‌ల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని బిల్లులు ఇవ్వకుండా సర్పంచులను అప్పుల పాలుచేసిందని, ఇందుకు నిరసనగా తాను బీజేపీలో చేరినట్లు సర్పంచ్ ఇంద్రకరణ్ తెలిపారు. ఆయన వెంట బీజేపీ మండలాధ్యక్షుడు కమలాకర్‌రెడ్డి, జిల్లా నాయకులు మోహన్‌రెడ్డి, మేడపాటి ప్రకాశ్‌రెడ్డి, ఉప్పు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల నిర్మాణ పనులకు నిధులు మంజూరు



డిచ్‌పల్లి: నూతన సచివాలయంలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని మంగళవారం ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో నిర్మించనున్న ఆలయాలకు నిధులు మంజూరు చేయాలని మంత్రిని కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి ఏడు ఆలయాలు నిర్మించుకోవడానికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే బాజిరెడ్డి తెలిపారు.



రెంజల్ మండలంలోని వరి చేనులో నిలిచిన వర్షపు నీరు



రెంజల్‌లో మొలకలు వచ్చిన ధాన్యాన్ని చూపిస్తున్న రైతు

చేలల్లో నీరు.. కల్లాల్లో మొలకలు

- జిల్లాలో మరో 4,158 ఎకరాల్లో పంటనష్టం
- సోమవారం రాత్రి భారీ వర్షం
- మళ్లీ తడిసి ముద్దయిన కల్లాల్లోని ధాన్యం
- పలుచోట్ల కొట్టుకుపోయిన వడ్లు, తడిసిన బస్తాలు
- నేలకొరిగిన వరి, నువ్వు పంటలు
- తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతుల డిమాండ్



డొంకేశ్వర్ మండలం మారంపల్లిలో తడిసిన ధాన్యాన్ని ఎత్తుతున్న మహిళా రైతు

డొంకేశ్వర్(ఆర్మూర్): అకాల వర్షాలు రైతులతో చెలగాటం ఆడుతున్నాయి. చేతికొచ్చిన పంటలను చేతికందకుండా చేస్తున్నాయి. పొద్దంతా వాతావరణం మామూలుగానే ఉంటూ రాత్రి అయ్యేసరికి భారీవర్షం కురుస్తోంది. వాన దేవుడి ప్రతాపం సోమవారం కూడా కంటిన్యూ అయ్యింది. రాత్రి ఎనిమిది గంటల ప్రాంతంలో మొదలైన జోరువాన 11 గంటల వరకు కొనసాగింది. దీంతో రైతులు కల్లాల్లోని వడ్ల కుప్పలపై ఎంత కట్టుదిట్టంగా టార్పాలిన్లు కప్పి ఉంచినా చాలాచోట్ల ధాన్యం తడిసిపోయింది. తూకం వేసి లారీల్లో మిల్లులకు తరలించడానికి సిద్ధంగా ఉంచిన ధాన్యం బస్తాలు నానిపోయాయి. వడ్ల పరిస్థితి చూసి రైతుల గుండెలు ఆవేదనతో బరువెక్కాయి.

పంట నష్టం వివరాల సేకరణ

సోమవారం రాత్రి కురిసిన జోరు వర్షానికి జిల్లా వ్యాప్తంగా వరి, నువ్వు, మామిడి కలిపి 4,158 ఎకరాల్లో పంటనష్టం వాటిల్లింది. నిజామాబాద్ రూరల్, మోపాల్, డిచ్‌పల్లి, ఇందల్వాయి, ధర్పల్లి, ఆర్మూర్, మాక్లూర్, నందిపేట్, డొంకేశ్వర్, భీమ్‌గల్, బాల్కొండ, మెండోరా, ముప్కాల్, మోస్రా, కోటగిరి మండలాల్లో పంటలు దెబ్బతిన్నట్లుగా వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఈ మండలాల్లో ఏఈవోలు రైతు వారీగా వివరాలను సేకరించి జిల్లా శాఖకు చేరవేశారు. కల్లాల్లోనే ఎక్కువ ధాన్యం తడిసిపోయినప్పటికీ, దానిని వ్యవసాయాధికారులు లెక్కలోకి తీసుకోలేదు. అయితే, ఇప్పటి వరకు యాసంగిలో 25వేల వరకు పంటనష్టం జరగగా, తాజా పంటనష్టంతో దాదాపు 30వేల ఎకరాలకు చేరువైంది.

సోమవారం పంట నష్టం (ఎకరాల్లో)

వరి	3,498
నువ్వు	640
మామిడి	20
మొత్తం	4,158
ప్రభావిత గ్రామాలు	83
మండలాలు	15
బాధిత రైతులు	3,250

174 బస్తాలు తడిసిపోయాయి



సోమవారం సాయంత్రానికి వడ్లు తూకం వేసి బస్తాల్లో నింపారు. వర్షం రావడంతో లారీల్లో బస్తాలు ఎక్కించలేదు. రాత్రి కావడంతో టార్పాలిన్లు కప్పి ఉంచాను. కానీ భారీ వర్షానికి 174 ధాన్యం బస్తాలు తడిసిపోయాయి. మిల్లులకు తీసుకెళ్తారో లేదో భయంగా ఉంది.
– మొగులన్న, తొండాకూర్, డొంకేశ్వర్ మండలం

23.3 మి.మీ. వర్షపాతం

సుభాష్‌నగర్: జిల్లావ్యాప్తంగా సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం వరకు 23.3 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. బోధన్, నవీపేట్, మోపాల్, చందూర్, ధర్పల్లి, బాల్కొండ, నందిపేట్, నిజామాబాద్ రూరల్, డిచ్‌పల్లి, ఇందల్వాయి, ముప్కాల్, మాక్లూర్, ఆర్మూర్, వర్ని, సిరికొండ, నిజామాబాద్ సౌత్, నార్త్, చందూర్, మోస్రా, తదితర మండలాల్లో అధిక వర్షం కురిసింది. ఏర్గట్ల, కమ్మర్‌పల్లి, కోటగిరి, తదితర మండలాల్లో స్వల్పంగా వర్షపాతం నమోదైంది. సోమవారం రాత్రి పలు మండలాల్లో వడగళ్ల వర్షం కురిసింది. మరో రెండు రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీగా వర్షం కురిసే అవకాశముందని వాతావరణశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

జిల్లాలో వర్షపాతం

మండలం	మిల్లీమీటర్లు	మండలం	మిల్లీమీటర్లు	మండలం	మిల్లీమీటర్లు	మండలం	మిల్లీమీటర్లు
		మోర్తాడ్	22.0	భీమ్‌గల్	10.3	నిజామాబాద్ సౌత్	22.4
		మాక్లూర్	29.0	ఎడపల్లి	21.1	నిజామాబాద్ నార్త్	22.4
		కమ్మర్‌పల్లి	7.1	వేల్పూర్	9.8	చందూర్	35.0
నవీపేట	42.0	ముప్కాల్	18.8	డిచ్‌పల్లి	31.4	కోటగిరి	22.8
బాల్కొండ	32.8	జక్రాన్‌పల్లి	12.2	బోధన్	46.6	ఇందల్వాయి	5.2
మెండోర	9.5	ఆర్మూర్	22.5	వర్ని	21.6	మోస్రా	22.0
నందిపేట	30.3	రెంజల్	32.2	సిరికొండ	28.3	ధర్పల్లి	35.0
ఏర్గట్ల	1.5	నిజామాబాద్‌రూరల్	29.7	మోపాల్	35.6	రుద్రూర్	18.0

నెమ్మదించిన ధాన్యం కొనుగోళ్లు

- కొనుగోలు కేంద్రాల్లో తగ్గిన సేకరణ
- వర్షం వల్ల ధాన్యం అన్‌లోడ్ చేయడానికి ఇబ్బందులు

మోర్తాడ్/బాల్కొండ: అకాల వర్షాలతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. చేతికి అందిన పంటను విక్రయించడానికి రైతులు సిద్ధంగా ఉన్నా వాతావరణంలో మార్పులతో ధాన్యం సేకరణకు ఆటంకాలు కలుగుతున్నాయి. కొనుగోలు కేంద్రాల్లోనే కాకుండా వ్యాపారులు సైతం ధాన్యం కొనుగోళ్ల పరిమితిని తగ్గించారు. ఫలితంగా ధాన్యం కొనుగోళ్లు నెమ్మదించాయి. కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని విక్రయిస్తే తమ బాధ్యత తీరుతుందని రైతులు భావిస్తున్నారు. వర్షం ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి ఏర్పడడంతో ధాన్యం అన్‌లోడింగ్‌కు ఇబ్బందులు కలుగుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. జిల్లాలో 458 కేంద్రాల ద్వారా ధాన్యంను కొనుగోలు చేస్తున్నారు. ప్రతి కొనుగోలు కేంద్రం నుంచి రోజుకు ఒక లారీ ధాన్యాన్ని తరలించే అవకాశం ఉంది. కానీ పది కొనుగోలు కేంద్రాలకు ఒక లారీని పంపిస్తుండడంతో తూకం వేసిన ధాన్యం ఎక్కడికక్కడే నిల్వ ఉంది. భీమ్‌గల్, వేల్పూర్, కమ్మర్‌పల్లి, బాల్కొండ, ముప్కాల్, మెండోరా, సిరికొండ, ధర్పల్లి, ఇందల్వాయి, డిచ్‌పల్లి, ఆర్మూర్, డొంకేశ్వర్, ఆలూర్, నందిపేట్, మాక్లూర్ తదితర మండలాల్లో ధాన్యం కుప్పలు ఎక్కడికి అక్కడే ఉన్నాయి. తూకం వేసిన ధాన్యాన్ని కూడా తరలించే పరిస్థితి లేకపోవడంతో ధాన్యం సంచులను అలాగే ఉంచి టార్పాలిన్ కవర్లను కప్పి ఉంచారు. తూకం వేసినా ధాన్యం లోడింగ్ చేసే పరిస్థితి కనిపించకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ధాన్యం కాంటాలు నిర్వహించిన బస్తాలు మిల్లులకు తరలించే వరకు రైతులదే బాధ్యత కావడంతో బస్తాల వద్ద కాపాలా కాస్తున్నారు.

వ్యాపారులదీ అదే మాట..

యాసంగిలో సాగుచేసిన సన్నరకాలను కొనుగోలు చేస్తున్న వ్యాపారులు సైతం వాతావరణంలో మార్పుల వల్ల ధాన్యం సేకరణకు వెనుకంజ వేస్తున్నారు. వర్షంలో ధాన్యం లోడింగ్, అన్‌లోడింగ్‌కు ఇబ్బందులు తలెత్తుతున్నాయని ధాన్యం తూకం వేయడం నిలిపివేస్తున్నారు.

రైతుల ఆందోళన

వర్షాలతో కల్లాల్లో తడిసిన ధాన్యానికి పలు మండలాల్లో మొలకలు వచ్చాయి. నిజామాబాద్ రూరల్ మండలం గుండారం, రెంజల్ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్ల ఆలస్యం కావడంతో మొలకెత్తాయి. డొంకేశ్వర్, డిచ్‌పల్లి, ఇందల్వాయి, మాక్లూర్, నందిపేట్, ఇతర మండలాల్లో వడ్లు తడిసి ముద్దయ్యాయి. వర్షం దాటికి ధాన్యం కొట్టుకుపోయింది. అయితే, నానిపోయిన వడ్లను కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మాక్లూర్ మండలం అడవి మామిడిపల్లిలో 63వ జాతీయ రహదారిపై ధర్నాకు దిగారు. తడిసిన ధాన్యాన్ని కొనాలని డిమాండ్ చేశారు.



మోపాల్ మండలం కాస్‌బాగ్ తండాలో నీట మునిగిన వరి ధాన్యం

సమ్మెకు సై..!

- ఈనెల 5 నుంచి పాల్గొననున్న జీపీ కారోబార్లు, సిబ్బంది
- కలెక్టర్, డీపీవోలకు నోటీసులు అందజేత

సుభాష్‌నగర్: గ్రామ పంచాయతీల్లో మల్టీపర్పస్ సేవలు అందిస్తున్న కారోబార్లు, సిబ్బంది సమ్మె బాట పట్టనున్నారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా కలెక్టర్లు, డీపీవోలకు సమ్మె నోటీసులు అందజేశారు. 5వ తేదీలోపు సమస్యలపై స్పందించకుంటే ఏ క్షణమైనా సమ్మెకు దిగేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే జూనియర్ పంచాయతీ కార్యదర్శులు నిరవధిక సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. తాజాగా కారోబార్లు, సిబ్బంది కూడా సమ్మె బాట పట్టడంతో గ్రామ పంచాయతీల్లో సేవలు పూర్తిగా నిలిచిపోనున్నాయి.

2,720 మందికిపైగా..

జిల్లాలో మొత్తం 530 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అందులో 522 మంది కారోబార్లు, 2,198 మందికిపైగా మల్టీపర్పస్ కార్మికులు విధులు నిర్వర్తిస్తున్నారు. మూడేళ్ల క్రితం 51 జీవోను ప్రభుత్వం తీసుకొచ్చి కార్మికులందరితో అన్నిరకాల పనులు చేయిస్తోంది. మల్టీపర్పస్ కా ర్మికుల్లో సఫాయి, ఎలక్ట్రీషియన్, వాటర్ మెన్, ట్రాక్టర్ డ్రైవర్ ఉంటారు. 500 మంది జనాభాకు ఒక కార్మికుడికి రూ. 8,500 చొ ప్పున వేతనం చెల్లిస్తోంది. నైపుణ్యం లేకున్నా.. అన్నిరకాల పనులు చేయిస్తున్నారు.

కాగా మే డే సందర్భంగా పంచాయతీ కార్మికులకు రూ. వెయ్యి పెంచుతూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. కానీ పెంచిన వేతనం కూడా గ్రామ పంచాయతీలో నుంచే తీసుకోవాలని స్పష్టతనిచ్చింది. ఆర్థిక సంఘం, ఎస్ఎఫ్‌సీ నిధులు రాక మూడు నెలలకొకసారి సిబ్బందికి వేతనాలు చెల్లిస్తున్న తరుణంలో మరో రూ. వెయ్యి పెంచడంపై వారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



డీపీవోకు సమ్మె నోటీసు అందజేస్తున్న కారోబార్లు

పంచాయతీల్లో నిలిచిపోనున్న సేవలు..

పంచాయతీ వ్యవస్థలో సఫాయి కార్మికులు, ఎలక్ట్రీషియన్లు, వాటర్‌మెన్లు, ట్రాక్టర్ డ్రైవర్లు కీలకం. అటువంటి సిబ్బంది సమ్మెకు దిగుతుండడంతో గ్రామాల్లో వారి సేవలు పూర్తిగా నిలిచిపోనున్నాయి. జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సమ్మెలో ఉండడంతో ఏమేం పనులు చేయాలో కారోబార్లు, సిబ్బందికి అర్థంకాక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సిబ్బంది కూడా సమ్మెకు వెళ్తే పారిశుధ్యం, నీటి విడుదల, చెత్త సేకరణ వంటి పనులు ఆగిపోతాయి. తద్వారా గ్రామాలు అపరిశుభ్రంగా తయారయ్యే అవకాశముంది.

ప్రధాన డిమాండ్లు..

- కారోబార్లు, బిల్ కలెక్టర్లను అసిస్టెంట్ పంచాయతీ కార్యదర్శికి ప్రత్యేక హోదా కల్పించి కనీస వేతనం రూ. 21,500 ఇప్పించాలి.
- జీపీల్లో పనిచేస్తున్న సిబ్బందికి 51 జీవో సవరించి కేటగిరీల వారీగా హోదా కల్పించాలి. కనీస వేతనం రూ. 15,500 చెల్లించాలి.
- ఉద్యోగ భద్రత, బీమా సౌకర్యం కల్పించాలి.
- పంచాయతీ నిధుల నుంచి కాకుండా నేరుగా ప్రభుత్వమే వేతనాలు సిబ్బంది ఖాతాల్లో జమ చేయాలి.
- పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలి.
- సిబ్బంది మరణిస్తే వారి కుటుంబసభ్యుల్లో ఒకరికి అవకాశమివ్వాలి.

సమ్మెకు సిద్ధం..



రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ కారోబార్లు, సిబ్బందికి రూ. 21,500, రూ. 15,500 వేతనం చెల్లించాలి. కారోబార్లకు అసిస్టెంట్ పంచాయతీ కార్యదర్శులుగా ప్రత్యేక హోదా కల్పించాలి.
– మారుతి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, టీజీకేఎస్‌యూ

వేతనాలు ఆలస్యం..

- హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు
- ప్రస్తుతం తెయూ రిజిస్ట్రార్ ఎవరనే సందిగ్ధం
- కౌంటర్ దాఖలు చేసిన ప్రభుత్వం
- హైకోర్టుకు వేసవి సెలవులు

తెయూ(డిచ్‌పల్లి) : తెలంగాణ వర్సిటీ టీచింగ్, నాన్-టీచింగ్ ఉద్యోగులు, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి ఈ నెల జీతాలు ఆలస్యంగా రానున్నాయి. ప్రతినెల ఒకటిన ఉద్యోగుల జీతాలు వారి బ్యాంకు ఖాతాలో జమచేస్తారు. ఈ సారి మాత్రం రెండో తేదీ గడిచినా రాలేదు. గతనెల 19న హైదరాబాద్‌లో జరిగిన 55వ ఈసీ సమావేశం నిర్వహించారు. వీసీ రవీందర్ అధికారాలకు కత్తెర వేయడంతో పాటు ఆయన ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా నియమించిన విద్యావర్ధినిని తొలగించి రెండేళ్ల కాలానికి రిజిస్ట్రార్‌గా యాదగిరిని నియమిస్తూ పాలకమండలి తీర్మానించింది. వీసీ చేపట్టిన అక్రమ పదోన్నతులు, నియామకాలను రద్దు చేశారు. అలాగే వారం వ్యవధిలో ఈ నెల 26న జరిగిన ఈసీ సమావేశంలో వీసీ అక్రమాలకు సహకరించారని పేర్కొంటూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా వ్యవహరించిన విద్యావర్ధినిని సస్పెన్షన్ చేస్తూ తీర్మానించారు. వీసీ అక్రమాలపై ఏసీబీ విచారణ జరిపించాలని నిర్ణయించారు. దీంతో 55వ ఈసీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను సవాల్ చేస్తూ వీసీ హైకోర్టును ఆశ్రయించారు. తుది తీర్పు వచ్చే వరకు ఈసీ నిర్ణయాలను రద్దు చేస్తూ గతనెల 28న కోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ వాకాటి కరుణ, రిజిస్ట్రార్‌తో విద్యాశాఖ అధికారులకు నోటీసులు జారీ చేసింది.

ఈ నెల 30 వరకు సెలవులు

తమకు అందిన నోటీసులపై రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత విద్యాశాఖ ద్వారా మంగళవారం హైకోర్టులో కౌంటర్ దాఖలు చేసినట్లు వర్సిటీ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం కోర్టుకు ఈ నెల 30 వరకు వేసవి సెలవులు ఉన్నాయి. దీంతో హైకోర్టు తుది తీర్పు వెలువడి, తెయూ రిజిస్ట్రార్ ఎవరనేది తేలేవరకు ఉద్యోగుల జీతాల కోసం వేచి చూడక తప్పదు.

ఉత్తర్వులు అందకపోయినా..!

హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు అధికారికంగా అందకపోయినా కోర్టు ఉత్తర్వులను గౌరవిస్తూ రిజిస్ట్రార్ యాదగిరి ఫైళ్లపై సంతకాలు చేయడం లేదు. అలాగే తనను సస్పెన్షన్ చేస్తూ ఈసీ చేసిన తీర్మానం ఉత్తర్వులు అందకపోయినా మాజీ రిజిస్ట్రార్ విద్యావర్ధిని యథావిధిగా విధులకు హాజరవుతున్నప్పటికీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా కొనసాగేందుకు ఇష్టపడడం లేదు. వర్సిటీ ఉద్యోగులకు సంబంధించిన జీతాల చెల్లింపు ఫైలుపై రిజిస్ట్రార్ హోదాలో ఎవరు సంతకం చేయకపోవడంతో ఫైలు అకౌంట్ సెక్షన్‌ను రాలేదని తెలుస్తోంది. అసలు ఇప్పుడు వర్సిటీ రిజిస్ట్రార్ ఎవరనే విషయంలో కూడా సందిగ్ధత నెలకొంది.

క్లుప్తంగా

సైక్లింగ్‌తో మానసికోల్లాసం



నిజామాబాద్‌నాగారం : సైక్లింగ్‌ వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని, సైక్లింగ్‌ చేయడం ద్వారా ఆరోగ్యం బాగుంటుందని, మానసిక ఉల్లాసం కలుగుతుందని డిచ్‌పల్లి తహసీల్దార్‌ శ్రీనివాస్‌రావు అన్నారు. మంగళవారం బర్ధీపూర్‌ గ్రామ శివారులో జిల్లా సైక్లింగ్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరాన్ని డిచ్‌పల్లి తహశీల్దార్‌ శ్రీనివాస్‌రావు ప్రారంభించారు. శిక్షణ శిబిరాన్ని సైక్లిస్టులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జాతీయ సైక్లిస్టు కె.రాఘవేంద్రను ఇన్‌చార్జి కోచ్‌గా నియమించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి భూలోకం విజయ్‌ కాంత్‌ రావ్‌, సైక్లింగ్‌ సంఘం ప్రతినిధులు గడ్డం రవి, నరేష్‌ కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర సమరయోధుడు మృతి



హన్మంత్‌రెడ్డి(ఫైల్‌)

కమ్మర్‌పల్లి : కమ్మర్‌పల్లి మండలం హాసాకొత్తూర్‌ గ్రామానికి చెందిన స్వాతంత్య్ర సమరయోధుడు ముత్యాల హన్మంత్‌రెడ్డి(97) మంగళవారం మరణించారు. హన్మంత్‌రెడ్డి నిజాం సర్కార్‌కు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో నిజామాబాద్‌కు చెందిన జె.హన్మంత్‌, కామారెడ్డి వెంకట్‌రెడ్డిలతో కలిసి పోరాడారు. జిల్లా జైలులో, చంచల్‌గూడ జైలులో శిక్ష కూడా అనుభవించారు. స్వాతంత్య్రం వచ్చిన అనంతరం 25 ఏళ్లు హాసాకొత్తూర్‌ గ్రామానికి సర్పంచ్‌గా సేవలందించారు. ఆయనకు ముగ్గురు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు.

బహుమతి వచ్చిందంటూ ఆన్‌లైన్‌లో మోసం

కామారెడ్డి క్రైం : మీ ఫోన్‌ నెంబర్‌కు బహుమతి గెలుచుకున్నారని నమ్మించిన ఆన్‌లైన్‌ మోసగాళ్లు ఓ వ్యక్తికి రూ. 4 వేలకు టోకరా వేశారు. జిల్లా కేంద్రంలోని అజాంపుర కాలనీకి చెందిన సయ్యద్‌ తాహెర్‌కు ఈనెల 19న ఫేస్‌బుక్‌లో 'చోటే మియా, బడే మియా జంజం ఎల్రక్ట్రానిక్స్‌' అనే యాప్‌ నుంచి గిఫ్ట్‌ వచ్చినట్లు మెసేజ్‌ వచ్చింది. వాట్సాప్‌ ద్వారా మెసేజ్‌ను ఓపెన్‌ చేయాలని సూచించారు. వారు చెప్పినట్లుగా చేయడంతో తాహెర్‌ అకౌంట్‌లో నుంచి రూ. 4 వేలు కట్‌ అయ్యాయి. మోసం జరిగినట్లు గుర్తించి మంగళవారం పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్‌హెచ్‌ఓ నరేష్‌ తెలిపారు.

జూన్‌ 1 నుంచి డిగ్రీ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి) : తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ రెగ్యులర్‌, బ్యాక్‌లాగ్‌ పరీక్షలు జూన్‌ 1 నుంచి ప్రారంభమవుతాయని కంట్రోలర్‌ ప్రొఫెసర్‌ ఎం.అరుణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ రెండవ, నాల్గవ, ఆరవ రెగ్యులర్‌ థియరీ, ఒకటవ, మూడవ, ఐదవ సెమిస్టర్‌ బ్యాక్‌లాగ్‌ పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్షల షెడ్యూల్‌ పూర్తి వివరాలను త్వరలో యూనివర్సిటీ వెబ్‌సైట్‌ www.telanganauniversity.ac.inలో పొందుపరుస్తామని కంట్రోలర్‌ తెలిపారు.

ఎట్టకేలకు పెరిగిన వేతనాలు

- ఒక్కో జీపీ కార్మికుడికి నెలకు రూ. వెయ్యి పెంచుతూ ఉత్తర్వులు
- పెంచిన వేతన భారం పంచాయతీలపైనే..
- జిల్లాలో 2,720 మంది కార్మికులకు పెరిగిన వేతనాలు



హైదరాబాద్‌లోని పంచాయతీ కమిషనర్‌ కార్యాలయం వద్ద కార్మికుల నిరసన (ఫైల్‌)

మోర్తాడ్‌(బాల్కొండ): గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న మల్టీపర్పస్‌ కార్మికులకు ప్రతి నెలా రూ. వెయ్యి పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. గ్రామ పంచాయతీ కారోబార్లు, కార్మికులకు వేతనాలు పెంచాలని ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కార్మికుల సంఘాలు రాష్ట్ర ప్రభుత్వానికి గత నెలలో వినతి పత్రాలను అందించాయి. తమ డిమాండ్లను పరిష్కరించకపోతే ఈనెల 5వ తేదీ నుంచి సమ్మె చేపడుతామని నోటీసులు ఇచ్చారు. పంచాయతీ కార్మికుల ఆందోళన నేపథ్యంలోనే వేతనం పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటి వరకు పంచాయతీ సిబ్బందికి నెలకు రూ.8,500 వేతనం చెల్లిస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం ఇక నుంచి రూ. 9,500ల చొప్పున వేతనం చెల్లించనున్నారు. పెంచిన వేతనాన్ని చెల్లించే బాధ్యత పంచాయతీలపైనే ప్రభుత్వం భారం మోపింది. ప్రభుత్వం ప్రత్యేక గ్రాంటు ఏమీ ఇవ్వకపోవడంతో సర్వత్రా అసంతృప్తి వ్యక్తమవుతోంది. పంచాయతీల ఆదాయం అంతంత మాత్రంగానే ఉండగా పెంచిన వేతన భారను ప్రభుత్వం తీసుకోకపోవడంపై నిరసన వ్యక్తమైతుంది. పంచాయతీల్లో పని చేస్తున్న కారోబార్లు, ఎలక్ట్రీషన్‌, డ్రైవర్లు, పంప్‌ ఆపరేటర్లు, పారిశుద్ధ్య కార్మికులు అందరిని మల్టీపర్పస్‌ కార్మికులుగానే ప్రభుత్వం గుర్తించింది.

జీపీలకు ప్రతి నెలా భారమే..

జిల్లాలో 530 గ్రామ పంచాయతీలకు గాను 2,720 మంది కార్మికులు వివిధ రకాల పనులు చేస్తున్నారు. వీరికి ప్రతి నెలా పంచాయతీలు రూ. 2,31,20,000 వేతనాలు చెల్లిస్తున్నాయి. ఇప్పుడు పెంచిన వేతనంతో పంచాయతీలపై నెలకు రూ. 27.20లక్షల అదనపు భారం ఏర్పడనుంది. ఆర్థిక సంఘం నిధుల నుంచి గతంలో జీతాల కోసం వినియోగించేవారు. కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సంఘం మార్గదర్శకాలను మార్చడంతో వేతనాల కోసం జీపీలు పన్నుల ఆదాయం, స్టేట్‌ ఫైనాన్స్‌ కార్పొరేషన్‌ నిధులను వినియోగించేవి. ట్రెజరీ కార్యాలయాల ద్వారా వేతనాలను చెల్లించడానికి చెక్కులు పంపిస్తుండటం ఫ్రీజింగ్‌ కారణంగా చెక్కులు సకాలంలో చెల్లకపోవడంతో వేతనాలు చేతికందడంలో జాప్యం కలుగుతుంది.

పంచాయతీల కార్మికుల వేతనాల భారంను ప్రభుత్వం మోస్తేనే పంచాయతీలకు ఇబ్బంది తప్పుతుందనే వాదన వినిపిస్తుంది. అంతేకాకుండా ప్రభుత్వ నిధుల నుంచి వేతనా ల చెల్లిస్తే ప్రతి నెలా సకాలంలోనే తమ ఖాతాల్లో జీ తాలు జమైతాయని పంచాయతీ సిబ్బంది చెబుతున్నారు. పంచాయతీ కార్మికుల వేతనాలను ప్రభు త్వం పెంచినా క్షేత్ర స్థాయిలో మాత్రం సంతృప్తి లే కపోవడం గమనించదగ్గ విషయం అని చెప్పవచ్చు.

'సాక్షి' మాక్‌ ఎంసెట్‌కు విశేష స్పందన





నగరంలోని నిశిత డిగ్రీ కళాశాలలో మాక్‌ ఎంసెట్‌ ఆన్‌లైన్‌ పరీక్ష రాస్తున్న విద్యార్థినులు

సాక్షి స్పందన

నిజామాబాద్‌ అర్బన్‌ : 'సాక్షి' దినపత్రిక ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని నిషిత డిగ్రీ కళాశాలలో నిర్వహించిన మాక్‌ ఎంసెట్‌కు విశేష స్పందన లభించింది. దీనికి జిల్లాలోని వివిధ ప్రాంతల నుంచి విద్యార్థులు తరలివచ్చారు. 'సాక్షి' ఆధ్వర్యంలో కొన్నేళ్లుగా పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఎంసెట్‌ ఇంజినీరింగ్‌, మెడిసిన్‌ విభాగంలో ప్రోత్సాహాన్ని అందించేందుకు ఈ మాక్‌ఎంసెట్‌ టెస్ట్‌ నిర్వహిస్తూ వస్తోంది. దీనివల్ల విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరుతోంది. ప్రతి ఏడాదిలాగే ఈసారి కూడా ఇంజినీరింగ్‌, మెడిసిన్‌ విభాగాల్లో విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చేందుకు ఆన్‌లైన్‌ మాక్‌ టెస్టులు నిర్వహించింది. జిల్లాలోని విద్యార్థులు టెస్టులకు రిజిస్ట్రేషన్‌ చేసుకొని ఆన్‌లైన్‌ పరీక్షకు హాజరయ్యారు. ఉదయం10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష జరిగింది. నిపుణులైన విద్యావేత్తలచే రూపొందించబడిన మాక్‌ ఎంసెట్‌ టెస్ట్‌ పేపర్లు తయారు చేయబడ్డాయి. 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మాక్‌ ఎంసెట్‌ పరీక్షను ఎదుర్కొన్న విద్యార్థులు ప్రభుత్వం నిర్వహించే పరీక్షల్లో తేలికగా మార్కులు సాధించగలుగుతున్నారు. 'సాక్షి' నిర్వహించిన మాక్‌ ఎంసెట్‌ టెస్ట్‌కు ఎఆర్‌ కళాశాల యాజమాన్యం సహకారం అందించింది. ఈ పరీక్ష నిర్వహణలో సాక్షి బ్రాంచ్‌ మేనేజర్‌ పల్లె మహేష్‌ తదితరులు పాల్గొన్నారు.

నారదుడు ఆదర్శ పాత్రికేయుడు



మాట్లాడుతున్న జిల్లా ప్రముఖ్‌ ఇప్పకాయ సుదర్శన్‌

నిజామాబాద్‌ సిటీ : సమాచార భారతి ఇందూరు శాఖ ఆధ్వర్యంలో దేవర్షి నారద జయంతిని ప్రపంచ పాత్రికేయ దినోత్సవంగా ఘనంగా నిర్వహించారు. మంగళవారం నగరంలోని ఇందూరు మాధవ స్మారక సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జాగృతి వారపత్రిక జిల్లా ప్రముఖ ఇప్పకాయల సుదర్శన్‌ మాట్లాడుతూ నారదుడు దేవర్షి, సంగీతజ్ఞుడు, నిరంతరం లోక సంచారం చేస్తారని, ఆయన ఒక ఆదర్శ పాత్రికేయుడని తెలిపారు. నేటి సమాజంలో ఒక పాత్రికేయుడి జీవితం కూడా ప్రజల తరఫున పోరాడటమే, ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా పాత్రికేయుని జీవితం సాగుతుందన్నారు. విభాగ్‌ ప్రచారక్‌ నరేశ్‌ మాట్లాడుతూ మొదటి ఆదర్శ పాత్రికేయుడయిన నారదుని జయంతిని ప్రపంచం యావత్తు పాత్రికేయ దినోత్సవంగా జరుపుకుంటున్నరన్నారు. సమాచార భారతి బాధ్యులు రాంనరేష్‌, రుద్ర మధుసూదన్‌, శ్రీమన్నారాయణ చారి, రాజు, చక్రధర్‌ పాల్గొన్నారు.

వీవోఏల సమస్యలు పరిష్కరించాలి

- వీవోఏల జిల్లా అధ్యక్షుడు పోశెట్టి డిమాండ్‌
- పాత కలెక్టరేట్‌ నుంచి కలెక్టరేట్‌ వరకు భారీ ర్యాలీ



కలెక్టరేట్‌ ఎదుట నిరసన తెలుపుతున్న వీవోఏలు

సుభాష్‌నగర్‌ : తెలంగాణ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ పరిధిలో పనిచేస్తున్న వీవోఏల సమస్యలు వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ఐకేపీ వీవోఏ ఎంప్లాయిస్‌ అసోసియేషన్‌ జిల్లా అధ్యక్షుడు పోశెట్టి డిమాండ్‌ చేశారు. వీవోఏల సమ్మెలో భాగంగా మంగళవారం కలెక్టరేట్‌ ఎదుట ప్లకార్డులతో నిరసన తెలియజేశారు. అనంతరం కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతుకు వినతిపత్రం అందజేశారు. అంతకుముందు పాత కలెక్టరేట్‌ నుంచి కలెక్టరేట్‌ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోశెట్టి మాట్లాడుతూ 11 రోజులుగా వీవోఏలు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. కనీస గౌరవ వేతనం రూ.18వేలు అమల్జేయాలని, రూ. 10 లక్షల సాధారణ బీమా, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలన్నారు. గౌరవ వేతనం డీఆర్‌డీఏ అకౌంట్‌ నుంచి నేరుగా వీవోఏల ఖాతాల్లో జమ చేయాలని, జీవో నెంబర్‌ 58ని సవరిస్తూ మూడేళ్లకొకసారి పునఃరుద్ధరణ చేయాలని డిమాండ్‌చేశారు. అర్హత కలిగిన వారికి సీసీలుగా ప్రమోషన్లు ఇవ్వాలని, జాబ్‌ చాట్‌ డిక్లరేషన్‌ ప్రకటించాలని కోరారు. కరోనా సమయంలో చనిపోయిన వీవోఏ కుటుంబాలకు రూ. 10 లక్షల ఆర్థికసాయం చేయాలన్నారు. సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మెను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌ నాయక్‌, సుదర్శన్‌, నయీమ్‌, అరుణ, మురళి, సరళ, దీప, నాగరాజు, మంజులత, సరిత, సువర్ణ, సుమారు 500 మంది వీవోఏలు పాల్గొన్నారు.

22 నుంచి తెయూలో ప్రాక్టికల్‌ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి) : తెయూ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలల్లో వివిధ సెమిస్టర్లలో ఈనెల 22 నుంచి 30 వరకు నిర్వహిస్తారని కంట్రోలర్‌ ప్రొఫెసర్‌ ఎం.అరుణ మంగళవారం తెలిపారు. 2,4,6వ సెమిస్టర్‌ రెగ్యులర్‌, 1, 3, 5వ సెమిస్టర్‌ బ్యాక్‌లాగ్‌, ఏఈసీసీ, ఇంటర్నల్‌, స్కిల్‌ ఎన్‌హాన్స్‌మెంట్‌ కోర్సు (ఎస్‌ఈసీ) ప్రాక్టికల్‌, వైవావోస్‌ ఉంటాయన్నారు.

బీఈడీ పరీక్షలకు 66 మంది గైర్హాజరు

తెయూ(డిచ్‌పల్లి) : తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో మంగళవారం మధ్యాహ్నం జరిగిన బీఈడీ మొదటి సెమిస్టర్‌ రెగ్యులర్‌ పరీక్షకు 1,061మంది విద్యార్థులకు గానూ 995మంది హాజరు కాగా 66 మంది గైర్హాజరైనట్లు కంట్రోలర్‌ ప్రొఫెసర్‌ ఎం.అరుణ తెలిపారు. పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.

ఎస్సారెస్పీలోకి స్వల్ప ఇన్‌ఫ్లో



బాల్కొండ : శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌లోకి స్థానిక ఎగువ ప్రాంతాల్లో వారం రోజుల నుంచి వర్షాలు కురుస్తుండటంతో ప్రాజెక్ట్‌లోకి 2,951 క్యూసెక్కుల వరద నీరు వచ్చిచేరుతోంది. ప్రాజెక్ట్‌ నుంచి ఎస్కేప్‌ గేట్ల ద్వారా 50 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 588 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్‌ పూర్తి స్థాయి నీటి మట్టం 1091 (90 టీఎంసీలు) అడుగులు కాగా మంగళవారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1065.70 (21.57 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్‌ అధికారులు పేర్కొన్నారు.

జోరుగా కల్లు అక్రమ దందా

- కల్లు దుకాణం సీజ్‌ చేసినా దర్జాగా అమ్మకాలు
- విక్రయదారుడిపై కేసు
- 12 మంది లైసెన్స్‌లు రద్దు
- హెచ్‌ఆర్‌సీని ఆశ్రయించిన గౌడ కులస్తులు

ఖలీల్‌వాడి : ఎడపల్లి మండలంలోని జాన్కంపేట్‌లో కల్లు అక్రమ దందా జోరుగా సాగుతుంది. గతంలో ఈ ప్రాంతంలోని కల్లుబట్టీలో ఆల్ప్రాజోలం కలిపి కల్లును విక్రయిస్తున్నట్లు సమాచారం రాగా ఎక్సైజ్‌ అధికారులు దాడులు చేసి నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపారు. పరీక్షల్లోనూ కల్లులో ఆల్ప్రాజోలం ఉన్నట్లు నిర్ధారణ కావడంతో కల్లు డిపో లైసెన్స్‌ను రద్దు చేశారు. అయితే మళ్లీ కల్లు డిపో తెరిచేందుకు కొందరు ప్రయత్నాలు చేయడంతో కల్లు బట్టీ తెరవొద్దని స్థానికంగా పలువురు గౌడ కులస్తులు హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు కూడా కల్లులో ప్రమాదకరమైన ఆల్ప్రాజోలం కలిపినట్లుగా నిర్ధారణ అయ్యాక లైసెన్స్‌ ఎలా పునరుద్ధరిస్తారని పేర్కొంది. అయితే అదే ప్రాంతంలో దర్జాగా కల్లును అక్రమంగా సదరు వ్యక్తి అమ్ముతున్నప్పటికీ స్థానిక ఎక్సైజ్‌ అధికారులు పట్టించుకోకపోవడంపై సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్నాయి.

స్థానిక ఎక్సైజ్‌ అధికారుల నిర్లక్ష్యం..

హైకోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తూ అక్రమంగా కల్లు అమ్మకాలు సాగిస్తున్న సతీష్‌గౌడ్‌ను మూడు రోజుల క్రితం ఎక్సైజ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ అధికారులు దాడులు చేసి 26 లీటర్ల కల్లును స్వాధీనం చేసుకున్నారు. స్థానికంగా కల్లుదందా జరుగుతున్నా ఎక్సైజ్‌ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం శోచనీయం.

కల్లుగీత రాకున్నా..

జాన్కంపేట్‌లో పలువురు కల్లుగీత రాకున్న గాని గీతకార్మికులుగా లైసెన్స్‌లు పొందినట్లు ఆరోపణలున్నాయి. దీంతో గ్రామంలో 12 లైసెన్స్‌లు రద్దు చేశారు. దీంతో గ్రామంలోని పలువురు గౌడకులస్తులు హెచ్‌ఆర్‌సీని ఆశ్రయించారు. వీడియోగ్రాఫిక్‌ ట్యాపింగ్‌ టెస్ట్‌ నిర్యహించాలని హెచ్‌ఆర్‌సీ ఆదేశాలు ఇచ్చింది. కాని ఎక్సైజ్‌ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేకుండా పోయాయి. గతంలో అధికారులు సంతకాలు చేస్తూ లైసెన్స్‌లు ఇచ్చేవారు. ప్రస్తుం వీడియో ట్యాపింగ్‌ టెస్ట్‌ చేసి అనంతరం ఎక్సైజ్‌ అధికారులు కలెక్టర్‌ అనుమతి కూడా తీసుకోవాల్సి ఉంటుంది.

ధర్మాసనం విచారణ..

జానకంపేట్‌ కల్లుబట్టీలో ఆల్ప్రాజోలం ఉందని నిర్ధారణ కావడంతో హైకోర్టు జయవర్ధన్‌ గౌడ్‌, సతీష్‌గౌడ్‌లతోపాటు మరో 10 మంది లైసెన్స్‌లను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయినప్పటికీ మళ్లీ తమకు లైసెన్స్‌ పునరుద్ధరించాలని వారు హైకోర్టును ఆశ్రయించారు. అల్ప్రాజోలం ఉన్నట్లు తేలినందున పునరుద్ధరణ కుదరదని హైకోర్టు చీఫ్‌ జస్టిస్‌ ఉజ్వల్‌భుయాన్‌, తుకారాంజీల నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. అయినప్పటికీ సదరు సతీష్‌గౌడ్‌ తిరిగి అక్రమంగా కల్లు అమ్మడం చర్చనీయాంశంగా మారింది.

కల్లుదుకాణాన్ని సీజ్‌ చేశాం

జాన్కంపేట్‌ కల్లుదుకాణం హైకోర్టు ఆదేశాల మేరకు రద్దు చేశాం. 12 మంది లైసెన్స్‌లను రద్దు అయ్యాయి. కల్తీకల్లు అమ్మకాలపై దాడులు చేసి సతీష్‌గౌడ్‌ను అరెస్ట్‌ చేసి, కేసు నమోదు చేశాం. వీడియో ట్యాపింగ్‌ టెస్ట్‌ ద్వారా లెసెన్స్‌లు ఇస్తున్నాం. కలెక్టర్‌ సంబంధిత ఫైల్‌ పంపిస్తాం. హెచ్‌ఆర్‌సీ ఆదేశాలు నా దృష్టికి రాలేదు. వస్తే పరిశీలిస్తాను. – మల్లారెడ్డి, ఎక్సైజ్‌ సూపరింటిండెంట్‌, నిజామాబాద్‌

క్రైం కార్నర్‌

సైకిల్‌, బైక్‌ ఢీ : ఒకరి మృతి



దాసు మృతదేహం

ఖలీల్‌వాడి : సైకిల్‌ను బైక్‌తో అతివేగంగా ఢీకొనడంతో తీవ్ర గాయాలై చికిత్స పొందుతూ ఎర్రమైగల్ల దాసు (45) మృతి చెందినట్లు ఎస్సై సందీప్‌ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సిద్ధిపేట్‌ జిల్లా చేర్యాల మండలంలోని బండపల్లికి చెందిన దాస్‌ నగరంలో మేస్త్రి వృత్తి చేసుకున్నట్లు తెలిపారు. మార్చ్‌ 30న రాత్రి 8 గంటలకు సైకిల్‌పై గాయత్రినగర్‌ రోడ్డు దాటుతుండగా బైక్‌ అతివేగంగా వచ్చి ఢీకొనడంతో దాసుకు తీవ్ర గాయాలు కాగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారని తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య



మేకల రాజు (ఫైల్‌)

డిచ్‌పల్లి : మండలంలోని నడిపల్లి గ్రామానికి చెందిన మేకల రాజేశ్వర్‌ (42) మంగళవారం సాయంత్రం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు డిచ్‌పల్లి ఎస్సై కే.గణేష్‌ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం రాజేశ్వర్‌ కొంత కాలం డ్రైవర్‌గా, ప్రస్తుతం వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నాడు. మద్యానికి అలవాటు పడటంతో కుటుంబంలో కలహాలు రేగాయి. భార్య సావిత్రి, ఇద్దరు పిల్లలను తీసుకుని కొంత కాలం క్రితం పుట్టింటికి వెళ్లింది. దీంతో జీవితంపై విరక్తి చెందిన రాజు మంగళవారం మద్యం మత్తులో ఇంట్లోని సీలింగ్‌ ఫ్యాన్‌కు తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్య సావిత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నిప్పంటించుకొని మహిళ..

ఖలీల్‌వాడి : నగరంలోని 4వ టౌన్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని కోటగల్లికి చెందిన అగ్గు లావణ్య(42) ఒంటికి నిప్పంటించుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సందీప్‌ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అగ్గు లావణ్య మతిస్థిమితం సరిగా లేనందున కోటగల్లీ నుంచి తల్లిగారి ఇల్లయిన ఎల్లమ్మగుట్టలో ఉంటూ చికిత్స చేయించుకుంది. ఏప్రిల్‌ 30న రాత్రి 9 గంటల సమయంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో నైటీకి నిప్పంటించుకొని ఆత్మహత్యకు ప్రయత్నించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పాఠశాలలో చోరీకి యత్నం

నవీపేట : మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో గుర్తు తెలియని దుండగులు చోరీకి యత్నించారని పాఠశాల హెచ్‌ఎం అరుణ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పాఠశాల ప్రాంగణంలోని క్రీడా గది తలుపులు పగులగొట్టి ఆకతాయిలు చోరీకి పాల్పడ్డారన్నారు. గతంలో పలుమార్లు ఆకతాయిలు ఇలాగే విధ్వంసాలకు పాల్పడ్డారని పేర్కొన్నారు. ఆకతాయిలను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

ఒకరి మృతికి కారణమైన వ్యక్తికి ఐదేళ్ల జైలు

ఖలీల్‌వాడి : మధునాల దశా గౌడ్‌ అనే మృతి చెందడానికి కారణమైన కామే లాయక్‌కు ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ నిజామాబాద్‌ సెషన్స్‌ జడ్జి సునీత కుంచాల మంగళవారం తీర్పు చెప్పారు. భీంగల్‌ మండలంలోని పురాణిపేట్‌ మార్గంలో ఉన్న సాధన హైస్కూల్‌ దగ్గర 21 మే, 2021 న దశా గౌడ్‌ హత్య చేయబడినట్లు భీంగల్‌ సీఐ ఆఫీస్‌ అధికారి శ్రీనాథ్‌ రెడ్డి నేర విచారణను పూర్తి చేసి కోర్టుకు వివరాలు సమర్పించారు. ముద్దాయి లాయక్‌ తన భార్యను, వరుసకు చెల్లెలైన మరొక స్త్రీ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన దశాగౌడ్‌ను కట్టెతో కొట్టి గాయపర్చగా వెళ్లిపోయాడు. కొద్దిసేపటి తర్వాత తిరిగొచ్చిన దశాగౌడ్‌ మళ్లీ అదే విధంగా అసభ్యకరంగా ప్రవర్తించడంతో రాయితో కొట్టి గాయపర్చారు. దీంతో దశాగౌడ్‌ బంధువులు ఆయనను జీజీహెచ్‌కు తరలించి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. దీంతో లాయక్‌పై నేరారోపణలు రుజువు కాగా ఐదేళ్ల కఠిన జైలుశిక్షతో పాటు రూ. 1,000 జరిమానా విధించారు. పోలీసుల తరఫున పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ రవిరాజ్‌ ప్రాసిక్యూషన్‌ నిర్వహించారు.

రాత్రిళ్లలో హోటల్‌ నిర్వహిస్తున్నాడని..

ఖలీల్‌వాడి : నగరంలోని ఒకటవ టౌన్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని రైల్వే స్టేషన్‌ దగ్గర వెల్‌కమ్‌ హోటల్‌ ఓనర్‌ రియాజ్‌కు 188 ఐపీసీ సెక్షన్‌ కింద రెండు రోజులు జైలు శిక్ష విధిస్తూ సెకండ్‌ క్లాస్‌ మెజిస్ట్రేట్‌ ఖదీర్‌ తీర్పు వెలువరించినట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌ బాబు తెలిపారు. రియాజ్‌ ప్రతిరోజు రాత్రిళ్లలో వెల్‌కమ్‌ హోటల్‌ నడిపిస్తూ ఉంటాడని తెలిపారు.

అతిగా మద్యం సేవించి ఒకరి మృతి



పవన్‌కుమార్‌ మృతదేహం

ఖలీల్‌వాడి : నగరంలోని నాలుగవ టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని రాజారాణి వైన్స్‌ పర్మిట్‌రూమ్‌లో అతిగా మద్యం సేవించి పడిపోయి చికిత్స పొందుతూ వంగాల పవన్‌కుమార్‌(42) మృతి చెందినట్లు ఎస్సై సందీప్‌ తెలిపారు. మృతుని భార్య వంగల సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కామారెడ్డి పట్టణంలో..

కామారెడ్డి క్రైం : అతిగా మద్యం సేవించి ఒకరు మృతి చెందిన ఘటన కామారెడ్డి లో మంగళవారం వెలుగు చూసింది వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని స్నేహపురి కాలనీకి చెందిన నర్సింగరావుకు ఇద్దరు కుమారులు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమారుడైన కిషోర్‌ కుమార్‌ (42) గతంలో వివాహం జరిగి ఐదేళ్ల క్రితం విడాకులు జరిగాయి. కొద్దిరోజుల నుంచి మద్యానికి బానిసయ్యాడు. ఈనెల 30న సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. వెతికినా దొరకలేదు. మంగళవారం ఉదయం పూట రైల్వే ట్రాక్‌ సమీపంలో ఓ వ్యక్తి చనిపోయి ఉండగా పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి అనవాళ్ల ప్రకారం కుటుంబీకులకు సమాచారం ఇవ్వగా వారు చూసి కిషోర్‌కుమార్‌గా గుర్తించారు. అతిగా మద్యం సేవించి మృతి చెందినట్లు భావిస్తూ కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో నరేష్‌ తెలిపారు.

తుఫాన్‌ వాహనం చోరీ



చోరీకి యత్నించిన వ్యక్తులు

భీమ్‌గల్‌ : వాహనాన్ని కొనడానికి వచ్చి వాహనాన్నే చోరీ చేసి ఎత్తుకెళ్లిన ఘటన భీమ్‌గల్‌ పట్టణ కేంద్రంలో జరిగింది. ఎస్సై రాజ్‌ భరత్‌ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం పిట్లం మండలం చిన్న కొడప్‌గల్‌కు చెందిన మధు, గంగారాం అనే వ్యక్తులు రెండు రోజుల క్రితం భీమ్‌గల్‌ వచ్చారు. పట్టణానికి చెందిన కవిత రాజుకు చెందిన టీఎస్‌06 యూబీ నంబర్‌ ఉన్న తుఫాన్‌ బండిని బేరం చేశారు. బేరం ఆడుతున్న సమయంలోనే వాహనం కీని దొంగలించారు. వాహనం కొనేందుకు మళ్లీ వస్తామని అక్కడి నుండి వెళ్లిపోయారు. వాహనం ఎత్తుకెళ్లేందుకు అర్ధ రాత్రి వరకు వేచి ఉండి వారి వద్ద ఉన్న కీతో వాహనాన్ని స్టార్ట్‌ చేసి ఎత్తుకెళ్లారు. వాహనంకు అమర్చిన జీపీఎస్‌ను గమనించిన వాహన ఓనర్‌ రాజు పోలీసులకు సమాచారం అందించాడు. కానిస్టేబుల్‌ సహాయంతో వాహనాన్ని వెంబడిస్తూ జీపీఎస్‌ ద్వారా బాన్సువాడ వద్ద నిలిపిన వాహనంతో పాటు చోరీ చేసిన వ్యక్తులను పట్టుకొని భీమ్‌గల్‌ పోలీస్‌ స్టేషన్‌కు తీసుకొచ్చారు. యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజ్‌ భరత్‌ రెడ్డి తెలిపారు.

పురుగు మందు డబ్బాతో కలెక్టరేట్‌కు..

- భూమి కబ్జా చేశారని ఆందోళన
- సముదాయించిన అధికారులు



పురుగుమందు డబ్బాతో కామారెడ్డి కలెక్టరేట్‌లో బైఠాయించిన శేఖర్‌ కుటుంబీకులు

కామారెడ్డి క్రైం : తన భూమిని గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు కబ్జా చేశారని, న్యాయం చేయాలని డిమాండ్‌ చేస్తూ ఓ వ్యక్తి కుటుంబం ఏకంగా పురుగు మందు డబ్బాతో కలెక్టరేట్‌కు వచ్చి ఆందోళనకు దిగారు. ఈ ఘటన కామారెడ్డి కలెక్టరేట్‌లో మంగళవారం కలకలం రేపింది. వివరాలిలా ఉన్నాయి. దోమకొండ మండలం చింతమాన్‌పల్లి గ్రామానికి చెందిన శేఖర్‌ అనే వ్యకిగత తన భార్య లత, ఇద్దరు పిల్లలు, తల్లి లింగవ్వలతో కలిసి కలెక్టరేట్‌కు వచ్చాడు. పురుగుమందు డబ్బాను ముందు పెట్టుకుని కార్యాలయం ఎదుట బైఠాయించాడు. గ్రామ శివారులోని తన 15 గుంటల భూమిని శివరాజ్‌, సంతోష్‌, మహిపాల్‌ అనే వ్యక్తులు కలిసి కబ్జా చేశారని ఆరోపించారు. న్యాయం చేయకపోతే ఇక్కడే పురుగు మందు తాగి చనిపోతామని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టరేట్‌ ఎస్సై ఉదయ్‌ శేఖర్‌, సిబ్బంది వారిని సముదాయిచి డబ్బాను లాక్కున్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారం అయ్యే చూస్తామని హామీ ఇచ్చారు. అనంతరం బాధితులు కలెక్టరేట్‌ పాలనాధికారి రవీందర్‌కు ఫిర్యాదు చేసి వెనుదిరిగారు.